సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



ఏసీబీ వలలో..

లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

వివరాలు 10లో ▸



జూరాల గేట్ల మూసివేత

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే వరద తగ్గుముఖం పట్టడంతో క్రస్ట్‌గేట్లను మూసివేశారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /23.0

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

కందనూలు: ఆర్టీసీ బస్సుల వేళలు, కార్గో సేవలు, రూట్లలో ఎదురవుతున్న సమస్యలు, ఇతర అంశాలకు సంబంధించి మంగళవారం నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్‌తో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న డిపో మేనేజర్ దేవరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4గంటల సమయంలో నేరుగా ఫోన్ ద్వారా ప్రజలకు అందు బాటులో ఉంటారని, నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రజలు, వ్యాపారులు ఆర్టీసీ సేవలపై ఏదైన సమస్యలు, ఇబ్బందులు ఉంటే సెల్ నం.9959226288కు ఫోన్ చేసి తన దృష్టికి తీసుకరావచ్చని పేర్కొన్నారు.

7న జనరల్ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో ఈనెల 7న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పార ఉన్నవారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు. రోగులకు జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా రక్త, సాదారణ, కరోనా వైద్య పరీక్షలు ప్రతిరోజు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని, ఇతర వివరాలకు సెల్ నం .9440454284, 81063 33324లలో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యసిబ్బంది ప్రతి ఒక్కరు శిశువు పుట్టిన వెంటనే గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇచ్చే విధంగా తల్లికి, కుటుంబ సభ్యులకు అవగాహన చేపట్టాలని తెలిపారు. తల్లిపాలు తాగడం వల్ల శిశు మరణాలు తగ్గుతాయని, పోషణ స్థాయి మెరుగుపడుతుందని, ప్రారంభంలోనే బాల్య దశ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రసవాలు జరిగే ప్రతి ప్రభుత్వ , ప్రైవేటు ఆసుపత్రుల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో, స్వయం సహాయక బృందాల సమావేశాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

నాగర్‌కర్నూల్: ఈవీఎంలు, ఓటు హక్కుపై జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రజలకు అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నియోజకవర్గాల్లో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి అందులో ఈవీఎంలు అమర్చి ప్రజల వద్దకే వెళ్లి ఓటు ఏవిధంగా వేయాలి, ఈవీఎం పనితీరు, అనుమానాలు నివృత్తి చేయాలని సూచించారు. నాలుగు నియోజకవర్గాల్లో ప్రత్యేక మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం, కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఈవీఎం ద్వారా ప్రయోగ నమూనా ఓటు వేసి తన ఓటు తాను వేసిన గుర్తుకే పడుతుందని నిర్ధారణ చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

మళ్లీ తొలిమెట్టు

ప్రాథమిక విద్య బలోపేతమే ధ్యేయంగా అడుగులు



తొలిమెట్టులో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి
- చదవడం, రాయడమే ప్రమాణంగా..
- గుణాత్మకమైన మార్పు కోసం అర్థవంతమైన బోధన
- ఆగస్టు 2నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ

జిల్లా వివరాలిలా..

ప్రాథమిక పాఠశాలలు	1-5 తరగతుల విద్యార్థులు	ప్రాథమికోన్నత పాఠశాలలు
566	27,014	125

1-5 తరగతుల విద్యార్థులు	ప్రాథమికోన్నత స్థాయిలో బోధిస్తున్న ఉపాధ్యాయులు
11,613	1,715

అచ్చంపేట: పాఠశాల దశలో ప్రాథమిక విద్యే విద్యార్థి జీవితానికి పునాది. ఈ దశలో వారి తరగతులకు చెందిన సామర్థ్యాలు సాధించినప్పుడే నాణ్యమైన విద్య అందినట్లువుతుంది. చిన్నారుల్లో విద్యాప్రమాణాల పెంపు, గుణాత్మకమైన మార్పుకోసం గతేడాది పాఠశాల విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులు ప్రతిభ చాటడంతో ఈ విద్యా సంవత్సరం కూడా ప్రతి విద్యార్థిలో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ఎస్సీఈఆర్టీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. కోవిడ్–19 సంక్షోభం కారణంగా పాఠశాలల్లో చదువులు ఆగిపోవడంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం తగ్గింది. దీనిని తిరిగి పెంపొందిచేలా తొలిమెట్టు కార్యక్రమం అమలు చేస్తున్నారు.

రేపటి నుంచి శిక్షణ షురూ..

తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ నిర్ణయించింది. ఆగస్టు 2, 3 తేదీల్లో తెలుగు, 4, 5 తేదీల్లో గణితం, 7, 8 తేదీల్లో ఆంగ్లం ఉపాధ్యాయులకు ఆర్పీల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 1నుంచి 5 తరగతుల వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు మండల స్థాయిలో ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఆరుగురిని ఎంపిక చేసి ఇప్పటికే జిల్లా స్థాయిలో జూలై 19 నుంచి 21 వరకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొదిన ఆర్పీలు జూలై 22 నుంచి మండల స్థాయిలో రెండు రోజులు పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా వరదల కారణంగా నిలిచిపోయింది. తిరిగి ఆగస్టు 2నుంచి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలాఉండగా, గత విద్యా సంవత్సరం ఆగస్టు 15 నుంచి అన్ని ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలు చేశారు. జూలై, ఆగస్టు నెలల్లో ఉపాధ్యాయులకు విడతల వారీగా మూడు సార్లు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. తెలుగు, ఆంగ్లం,గ ణితంలో సామర్థ్యాల పెంపునకు విద్యాసంవత్సరం ముగిసే వరకు అమలు చేశారు. ప్రతి విద్యార్థిపై దృష్టి సారించి వారి ప్రగతిని పరీక్షిస్తూ ప్రణాళిక ప్రకారం బోధనాభ్యసంలో నిర్దిష్ట కనీస సామర్థ్యాలు సాధించేలా అమలు చేశారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉండేలా అమలు చేస్తున్నాం. తొలిమెట్టు కార్యక్రమంలో బాగంగా ఆగస్టు 2నుంచి మండల స్థాయి నుంచి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. పీరియడ్ ప్లాన్, లెస్సన్ ప్లాన్, ఇయర్లీ ప్లాన్ ఆధారంగా వారు ఐదు రోజుల పాటు నేర్పిన పాఠాలను వారాంతంలో పరీక్ష ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకుంటారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి.. విద్యలో తోటి విద్యార్థులను అందుకునేలా కృషి చేస్తాం.

– గోవిందరాజులు, డీఈఓ

చదవలేని, రాయలేని విద్యార్థుల కోసం..

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవలేని, రాయలేని స్థితిలో ఉన్నట్లు జాతీయ విద్యావనరుల శాఖ గతేడాది నివేదిక ద్వారా గుర్తించింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ గడ్డు పరిస్థితిని ఎదర్కొనేందుకు జిల్లా వ్యాప్తంగా తొటిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 566 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 125 ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న 38,627 మంది విద్యార్థులు ఈఏడాది కనీస సామర్థ్యాలు సాధించేలా కృషి చేయనున్నారు. విద్యార్థులు ఒకటో తరగతిలో నిమిషానికి 20పదాలు, రెండో తరగతిలో 25పదాలు, మూడో తరగతిలో 30పదాలు, నాలుగో తరగతిలో 40పదాలు, ఐదో తరగతిలో 50పదాలు ధారాళంగా చదవాలి. మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థులు ఇచ్చిన పేరా, గేయం, పద్యాన్ని చదివి అర్థం చేసుకోవాలి. ఐదు ప్రశ్నలిస్తే నాలుగు ప్రశ్నలకు సమాధానాలైనా సరైనవిగా చెప్పగలిగాలి. ఒకోట తరగతి విద్యార్థులు సరళ పదాలు, గుణింతం పదాలు, రెండో తరగతి చదివే వారు ఒత్తులు పదాలు, మూడు నుంచి ఐదు తరగతి చదివే పిల్లలు నాలుగు, ఐదు వ్యాక్యాలతో పేరాలు రాయగలిగే దశలో తయారు చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఐదు పదాల్లో కనీసంగా నాలుగు తప్పులు లేకుండా రాయగలిగేలా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించనున్నారు.

మాకు జైళ్లు కొత్తకాదు



అభివాదం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, డీకే అరుణ, ఆచారి, జితేందర్‌రెడ్డి, చంద్రశేఖర్

- బీఆర్‌ఎస్‌కు మూడు చెరువుల నీళ్లు తాపుతాం
- వచ్చే 90 రోజులు అతి ముఖ్యమైనవి
- పోలింగ్ బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు సిద్ధంకావాలి
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్/పాలమూరు: ఇక నుంచి బీఆర్‌ఎస్ నాయకులకు గ్రామాల్లో మూడు చెరువుల నీళ్లు తాపుతామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మాకు జైళ్లు కొత్తకాదని.. ప్రజా పోరాటాలు చేసిన తమను కేసులతో కట్టడి చేయలేరని పేర్కొన్నారు. వచ్చే 90 రోజులు అతిముఖ్యమైనవని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజల ఆశీస్సులు పొందాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ప్రజాసమస్యలపై మహార్యాలీ సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని క్లాక్ టవర్ వద్ద మహాధర్న చేపట్టారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సందర్శించేందుకు వెళ్తే తమను అరెస్టు చేశారని, ఇలాంటి చర్యలకు బీజేపీ భయపడదన్నారు. పాలమూరు పోరాటాలకు పుట్టినిల్లు అని, రాష్ట్రంలో ఏ మార్పు వచ్చినా.. ఏ పోరాటం జరిగినా ఆరంభం ఇక్కడి ను ంచే అన్నారు. బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలను అక్రమంగా తొలగిస్తున్నారని, ఇలాంటి వాటిపై సింహా ల్లా ముందుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఎ న్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం దోచుకున్న సొమ్ముతో ఎన్నికలకు సిద్ధమవుతుందని ఆరోపించారు.

గ్రామాల్లో భూములు కబ్జా

బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల మీద పడి భూములు కబ్జా చేస్తున్నారని, ఇసుక, లిక్కర్ మాఫియాలుగా మారి దోచుకుంటున్నారని ఆరోపించారు. సంతలో పశువుల్లా వివిధ రాజకీయ పార్టీల్లోని నాయకులను బీఆర్‌ఎస్ పార్టీ కొంటుందని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు వచ్చే ఎన్నికలకు సిద్ధం కావాలని, శక్తి కేంద్రాలు, గ్రామ కమిటీలు తమ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజల మన్ననలు పొందేలా చక్కదిద్దేలా చర్యలు చేపట్టాలన్నారు. కులాల పేరుతో బీఆర్‌ఎస్ మోసం చేస్తుందన్నారు. గిరిజనుల రిజర్వేషన్లకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, సేవాలాల్ జయంతిని ఢిల్లీలో నిర్వహించిన ఘనత తమదేనన్నారు. 6న మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో దాదాపు రూ.38 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేస్తారన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా నాగర్‌కర్నూల్ జిల్లాకు టూరిజం శాఖ నుంచి ఐకానిక్ బ్రిడ్జి మంజూరు చేశామని, ఈ పనులను త్వరలో ప్రారంభిస్తామని వివరించారు.



ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చే వరకు పోరాటం: డీకే అరుణ

కేసీఆర్ కుటుంబసభ్యులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. రాష్ట్రంలో ఏ నిరుద్యోగికి ఒక్క ఉద్యోగం కూడా రాలేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. రాష్ట్రంలో నియంత పాలన, మోసాలకు పాల్పడుతున్న పాలకులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఇళ్లు అందిస్తామన్నారు. స్థానిక మంత్రి భూ కబ్జాలు, దోపిడీలు చేస్తూ అమాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించి భయాందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కబ్జాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులతో అభివృద్ధి జరుగుతుంది తప్ప.. వీళ్ల సొంత డబ్బులతో కాదన్నారు. మంత్రి ఆయన భూముల ధరలు పెంచుకోవడానికి కలెక్టరేట్‌ను ఊరి బయటికి తరలించారని విమర్శించారు.

■ తెలంగాణ ప్రజలను కేసీఆర్ నమ్మించి మోసం చేశాడని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలపై పూర్తిగా అబద్ధాలు చెప్పాడని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని చెప్పిన మాటలు ఎక్కడపోయారని విమర్శించారు. లక్ష్మీదేవిపల్లి వరకు సాగునీరు ఎప్పుడూ వస్తుందో అంతుచిక్కడం లేదన్నారు. మహబూబ్‌నగర్‌లో 35వేల మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. కేవలం 2వేల ఇళ్లు నిర్మించి వాటిలో కూడా అధికార పార్టీ కార్యకర్తకలు, దళారులకు ఇచ్చి దందా నిర్వహించారన్నారు.

■ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను బొందపెట్టే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంతగా వ్యవహరిస్తుంటే.. పాలమూరులో శ్రీనివాస్‌గౌడ్ మరో కాశీం రజ్వీలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. ఎక్కడ చూసినా.. భూ కబ్జాలు, పోలీసుల అండతో అక్రమ కేసులు పెట్టించి అమాయకులను వేధిస్తున్నారన్నారని విమర్శించారు. నాలుగు నెలల తర్వాత మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నీ చరిత్ర మొత్తం బయటికి తీస్తామని.. అప్పుడు పాలమూరు జైలుకో లేకపోతే చర్లపల్లికో.. చంచల్‌గూడ జైలుకు పోతావో నువ్వే నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.చంద్రశేఖర్, ప్రదీప్‌కుమార్, శ్రీవర్ధన్‌రెడ్డి, నాగురావు నామాజీ, ఎన్పీ వెంకటేష్, పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ప్రజల విజ్ఞప్తులను సత్వరమే పరిష్కారించాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 128 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. అందులో ధరణికి సంబంధించి 100 వినతులు రాగా వివిధ శాఖలకు సంబంధించిన 28 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీతారామారావు, డీఆర్‌డీఓ నర్సింగరావు, ఈడీఎం నరేష్, పీఎస్ ఖాజామైనుద్దిన్ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 12 వినతులు

నాగర్‌కర్నూల్ క్రైం: పోలిసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషిచేయాలని ఎస్పీ మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయని ఇందులో 7 భూతగాదాకు సంబంధించి, లక్కీ డ్రా స్కీం డబ్బులు కట్టించుకుని పారిపోయిన ఘటన, ఇరువర్గాల మధ్య గొడవకు సంబంధించి మూడు ఫిర్యాదులు, భూ రిజిస్ట్రేషన్ విషయంలో చేసిన వ్యక్తిపై మరో ఫిర్యాదు అందినట్లు ఎస్పీ తెలిపారు.

రూ.6.50 కోట్లతో బిజినేపల్లి జంక్షన్ అభివృద్ధి

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన జంక్షన్ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.6.50 కోట్లతో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. అనంతరం వెల్గొండకి చెందిన కార్యకర్త వెంకటేష్ ఇంటికి వెళ్లి రూ.2 లక్షల పార్టీ ప్రమాద బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బిజినేపల్లి జంక్షన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

ప్రభుత్వంలో విలీన నిర్ణయంపై హర్షం

- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు
- ఎన్నో ఏళ్ల కల ఫలించిందంటున్న కార్మికులు
- మహబూబ్‌నగర్ రీజియన్‌లో 3,440 మంది ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తూ రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంపై మహబూబ్‌నగర్ రీజియన్‌లోని ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటం చేసిన ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇది ఎన్నో ఏళ్ల కల అని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని గౌరవంగా భావిస్తూ ఆర్టీసీ సంస్థను మరింత పురోగతిలో తీసుకోస్తామని అభిప్రాయం వ్యక్తం చేశారు.

■ మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లో పది డిపోలు ఉన్నాయి. మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, షాద్‌నగర్, నారాయణపేట, కొల్లాపూర్, కోస్గి డిపోలలో 3,440 మంది కార్మికులు ఉన్నారు. వీరందరూ ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు.



డిపో	ఉద్యోగులు
మహబూబ్‌నగర్	433
అచ్చంపేట	338
గద్వాల	401
కల్వకుర్తి	416
కొల్లాపూర్	248
నాగర్‌కర్నూల్	338
నారాయణపేట	372
షాద్‌నగర్	361
వనపర్తి	415
కోస్గి	52
ఆర్‌ఎం కార్యాలయం ఉద్యోగులు	66

వనపర్తిలో ఆర్టీసీ సిబ్బందికి స్వీట్లు తినిపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. కమిటీ విధివిధానాలు త్వరగా ఇచ్చి ఎన్నికల లోగా కొత్త జీత భత్యాలు ఇవ్వాలని విజ్ఞప్తి. ఈ విజయం అమరులైన ఆర్టీసీ కార్మికులకు అంకితంగా భావిస్తున్నాం.

– బసప్ప, టీఎంయూ రీజినల్ కార్యదర్శి, మహబూబ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



నేను ఆర్టీసీలో కండక్టర్‌గా 34 ఏళ్ల నుంచి పనిచేస్తున్న. రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడానికి కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. చెప్పలేని సంతోషంగా ఉంది. మా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన వరంగా భావిస్తున్నాం . కార్మికపక్షపాతి సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– జి.లక్ష్మణ్‌గౌడ్, టీఎంయూ ఉపాధ్యక్షులు, మహబూబ్‌నగర్


తీపి కబురు..



ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన తీపి కబురు. రెండు పేస్కేల్ పెండింగ్‌లో ఉండడం వల్ల ఎంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాం. కేబినెట్ సమావేశంలో ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేస్తామని నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

– కోదూరు శ్రీనివాస్, ఎస్‌డీఐ, మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా 26 రోజులగా పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక దీక్ష చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం సరికాదని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పసుపుల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. క్యాబినెట్ సమావేశంలో చర్చించాలని, భేషరతుగా కార్మికులను చర్చలకు పిలిచి సర్వీసు క్రమబద్ధీకరించాలన్నారు. కరోనా, లాక్‌డౌన్ సమయంలో వారి సేవలను కొనియాడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ నర్సింహ, గగనం శేఖరయ్య, బీసమొల్ల యోసోఫ్, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, కార్యదర్శి బోనాసి రాంచందర్, నాయకులు రామస్వామి, విష్ణుతేజ, కొమ్ము శ్రీనివాస్, గోపాల్, మోహన్‌రెడ్డి, కొయ్యల శ్రీనివాసులు, మహేష్ యాదవ్, ఎనుపోతుల ఆంజనేయులు, లక్ష్మణ్, దర్గస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అయిజ: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... మండలంలోని ఈడుగోనిపల్లికి చెందిన నాగరాజు(28) హనుమంతు పొలంలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లాడు. ఎద్దులతో పొలం దున్నుతుండగా బోర్‌మోటార్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ సర్వీస్ వైరు ఎద్దుకాలికి చుట్టుకుంది. అనంతరం నాగలికి తగిలింది. ఇదే సమయంలో నాగరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

కొల్లాపూర్: మండలంలోని ఎన్మన్‌బెట్ల చెందిన ఎర్రోళ్ల సాయికుమార్ (27) అనుమానస్పద స్థితిలో పట్టణంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సాయికుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కొన్ని నెలల క్రితమే వివాహం చేసుకున్నాడు. అయితే హైదరాబాద్‌లో నాలుగు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో అతని తండ్రి బాలాజీ అక్కడి పోలీస్‌స్టేషన్ మిస్సింగ్ కేసు నమోదు చేయించాడు. సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని పెట్రోల్ బంక్ సమీపంలో యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం చేయించారు. మృతుని వివరాలు తెలియడంతో వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని అప్పగించారు. సాయికుమార్ మరణానికి కారణాలు తెలియరాలేదు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ బాలవెంకటరమణ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

మక్తల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఊట్కూర్ మండలం బిజ్వార్ చెందిన బాలకృష్ణ జూలై 28న రాత్రి మక్తల్‌లో నుంచి బిజ్వార్‌కు తిరుగు ప్రయాణంలో బొందల్‌కుంట స్టేజీ వద్ద బైక్ వెళ్తూ ఆవును ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

బైక్ పైనుంచి పడి వివాహిత దుర్మరణం



శంకరమ్మ (ఫైల్)

చారకొండ: భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వివాహిత ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందింది. ఎస్ఐ రవి కథనం మేరకు.. మండలంలోని జూపల్లికి చెందిన కదారి శంకరమ్మ (48) ఆదివారం భర్తతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లింది. రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి కిందపడటంతో శంకరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. శంకరమ్మకు ముగ్గురు పిల్లలు, భర్త పోషన్న ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆటో బోల్తా: ఏడుగురికి గాయాలు

లింగాల: మండలంలోని మల్లోనిచెర్వుతండా సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడగా ఏడుగురు ప్రయాణికులు తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. లింగాల నుంచి శ్రీరంగాపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడిన సమయంలో 10 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. శ్రీశైలం, జానయ్య, బంగారమ్మ, మత్రి, గంగమ్మ, చంద్రమ్మ, ఈశ్వరమ్మ గాయాలపాలయ్యారు. తలకు బలమైన గాయమైన జానయ్యతో పాటు మిగతా వారిని 108 అంబులెన్సులో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కేసుల్లో ఆరుగురికి రిమాండ్

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు తూంకుంటలో చోటు చేసుకున్న ఘటనల్లో సోమవారం ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు. తూంకుంట సమీపంలో నిర్మిస్తున్న వంతెన దగ్గరకు సర్పంచ్ భర్త మౌలాలి, దావీదు వెళ్లి అక్కడ పనులు చేస్తున్న వ్యక్తులపై దాడి చేశారు. ఈ కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసి సోమవారం వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఏఎస్ఐ వివరించారు. అదేవిధంగా ఈ నెల 8న జరిగిన భూ తగాదాలో ప్రత్యర్థులపై దాడిచేసి గాయపర్చిన రామకృష్ణ, పెద్దరాముడు, ఎల్లస్వామి, రాజశేఖర్‌ను కోర్టు ఆదేశానుసారం రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎత్తిపోతలపై.. ఉత్తి మాటలే



సర్వే చేస్తున్న ఇరిగేషన్ అధికారులు, మల్లేశ్వరం, యంగంపల్లి గ్రామాల సర్పంచ్‌లు

- నాలుగు దశాబ్దాలుగా తడవని బీళ్లు
- మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఎదురు చూపులు..
- పాలకుల హామీలు బుట్టదాఖలు

పెంట్లవెల్లి: నాలుగు దశాబ్దాలుగా అన్నదాతల కల నేటికీ నెరవేరలేదు. 800 ఎకరాలు విస్తీర్ణం గల భూమి నీళ్లులేక బీడుగా మారింది. మండలంలోని వేముకల్లు, మల్లేశ్వరం, యంగంపల్లి తండా, మాదవస్వామినగర్ గ్రామాల రైతులు భూములున్నా వ్యవసాయానికి సాగునీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత పాలకులు మూడు గ్రామాల భూములు తడిపేందుకు ఎత్తిపోతల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో రైతులు సంబురపడ్డారు. అది ముణ్నాళ్ల ముచ్చటగానే మారింది. నాలుగు దశాబ్దాలు పూర్తయినా ఎత్తిపోతల పూర్తికాక పోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పక్కనే నిండుకుండలా కృష్ణానది పారుతున్నా, ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. చెంతనే నీరున్న భూములు తడుపే నాథుడు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయాల్లో అభ్యర్థులు గెలిస్తే లిఫ్ట్ పూర్తి చేస్తామని హామీలిచ్చి గెలిచాక మర్చిపోతున్నారు.



బీడుగా ఉన్న యంగంపల్లి వ్యవసాయ భూములు

ఎమ్మెల్యే కృషితో ప్రతిపాదనలు..

గతేడాది ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ అశోక్, అధికారులు ఆయా గ్రామాల్లో భూములు సర్వే చేశారు. అంచనా వ్యయంతో ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ఇప్పటికీ కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలని, తమ భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

మా తండ్రుల కాలం నుంచి బీడుగానే..



నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా మా తండ్రుల కాలం నుంచి ఇక్కడ భూములు బీడుగానే ఉన్నాయి. ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తామని నిత్యం నాయకులు హామీలు ఇస్తున్నారు తప్పా, వాటిని నెరవేర్చడం లేదు. ఇప్పటికైనా లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించి ఉపయోగంలోకి తీసుకురావాలి.

– ప్రవీణ్, యంగంపల్లి తండా

రూ.30 కోట్ల వ్యయంతో ప్రతిపాదన..

ఈ గ్రామాల చుట్టూ ఉన్న పొలాలను సర్వే చేశాం. మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు దాదాపు రూ.30 కోట్లతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఆమోదం రాగానే పనులు మొదలుపెడుతాం.

– అశోక్, ఏఈ ఇరిగేషన్

ఎస్ఐని సస్పెండ్ చేయాలని ధర్నా



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

- అకారణంగా ఎస్ఐ దాడి చేశారని సర్పంచ్ ఆరోపణ

కోడేరు: మండలంలోని మైలారం దళిత సర్పంచ్ మశన్నపై ఎస్ఐ శేఖర్‌రెడ్డి దాడి చేశాడంటూ సోమవారం దళిత సంఘం, కుల సంఘం నాయకులు పోలీసుస్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఘటనపై సర్పంచ్ మాట్లాడుతూ.. భూమి పంచాయితీ విషయంలో పోలీసుస్టేషన్‌కు వస్తే ఎస్ఐ అకారణంగా దూషిస్తూ కొట్టారని తెలిపారు. ఈ విషయం దళిత సంఘాల నాయకులకు తెలియడంతో వారు స్టేషన్ వద్దకు వచ్చి పోలీసుస్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేసి ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు, పెద్దకొత్తపల్లి ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, మహేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, ఎస్వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్ యాదవ్, పలువురు నాయకులు ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ ఈ విషయం తెలుసుకున్న సీఐ యాలాద్రి స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం సర్పంచ్‌పై దాడి చేసిన ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకుని ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని ఫిర్యాదు చేశారు.

ఎస్ఐ వివరణ

ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా.. బాధితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి మాట్లాడుతుండగా సర్పంచ్ మశన్న దురుసుగా ప్రవర్తించారన్నారు. ఆయనపై తాను చేయి చేసుకోలేదని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దురుసుగా ప్రవర్తించడంతో అతనిపై న్యూసెన్స్ కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ. 2.40 లక్షలు అపహరణ



బాధితుడు గోపి అశోక్‌తో వివరాలు సేకరిస్తున్న సీఐ రామకృష్ణ

దేవరకద్ర: మండల కేంద్రంలోని దళితవాడలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి రూ.2.40 లక్షలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన గోపి అశోక్ కారు కొనేందుకు రూ.2.40 లక్షలు ఇంట్లోని పెట్టెలో దాచాడు. ఆదివారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి రాత్రికి వచ్చాడు. ఇంటి వేసిన తాళం విరిగి కనిపించడంతో దొంగలు పడ్డట్లు గుర్తించారు. లోనికి వెళ్లి పెట్టె తెరిచి చూడగా డబ్బులు కనిపించలేదు. సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలాన్ని సీఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకటేశ్ పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మన్ననూరులో..

మన్ననూర్: మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న ఓ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సుధాకర్ బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్తులు తలుపులు తెరిచి ఉండటం చూసి లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరుచుకొని, సామగ్రి చిందరవందరగా పడి ఉండటం కనిపించింది. వెంటనే గ్రామంలో ఉండే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసి మరో తాళం వేసి ఇంటి యజమాని సుధాకర్‌కు సమాచారం ఇచ్చారు. దొంగలు ఎత్తుకెళ్లిన వాటి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రయాణికురాలి నుంచి బంగారం చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి నుంచి బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు.. తెలకపల్లి మండలం అనంతసాగర్‌కు చెందిన మాధవి నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కింది. కొద్దిదూరం వెళ్లాక టికెట్ కోసం పర్సులో నగదును వెతుకుతుండగా 13 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వలో జారిపడి మహిళ మృతి

ఆత్మకూర్: కాల్వలో జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని జూరాల గ్రామానికి చెందిన గట్టమ్మ(70) సోమవారం సాయంత్రం 4గంటల సమయంలో గ్రామశివారులోని డీ–6 కెనాల్ వద్ద దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు జారిపడి నీటమునిగింది. దీన్ని గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని ఆమెను ఒడ్డుకు చేర్చేలోపే మృతి చెందింది. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మూలమల్లలో వివాహిత..



శంకరమ్మ (ఫైల్)

మూలమల్ల గ్రామానికి చెందిన శంకరమ్మ(65)కు కొంతకాలంగా మానసిక పరిస్థితి బాలేదు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాలు.. కుటుంబ సభ్యులు సోమవారం ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. స్థానిక కెనాల్ వద్ద ఆమె చెప్పులు కనిపించడంతో నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

తండ్రి మందలించాడని.. పురుగుమందు తాగిన కూతురు

- చికిత్స పొందుతూ మృతి

గోపాల్‌పేట: తండ్రి మందలించాడని పురుగుమందు తాగి తనువు చాలించింది కూతురు. ఈ సంఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం గౌరిదేవిపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రేవల్లి ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. గౌరిదేవిపల్లికి చెందిన హనుమంతు, నిర్మల దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చిన్న కూతురు దీపిక (14) నాగర్‌కర్నూల్‌లోని తన చిన్నమ్మ సుప్రియ వద్ద ఉంటూ నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. పాఠశాలకు సెలవులు ఉండటంతో వారం క్రితం స్వగ్రామానికి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఓ అబ్బాయితో మాట్లాడుతూ ఉండగా తండ్రి చూశాడు. వెంటనే మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన దీపిక ఇంట్లోకి వెళ్లి పురుగులమందు తాగింది. కాసేపటికే ఇంట్లోనుంచి బయటికు వచ్చి వాంతులు చేసుకుంది. తల్లి గమనించి దగ్గరికి వెళ్లి అడగడంతో పురుగులమందు తాగానని చెప్పింది. దీంతో ఆమెను వెంటనే నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. బాలిక తండ్రి హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కొత్త వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్ క్రైం: కొత్త వ్యక్తులకు అద్దెకు ఇచ్చే క్రమంలో అవసరం అయిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ టి.మహేష్ అన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రిస్టియన్‌పల్లిలో సోమవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక పోలీస్ సిబ్బందితో క్రిస్టియన్ పల్లిలో మొత్తం 79 ఇళ్లలో 15 4మంది వివరాలు పరిశీలించారు. ఈ క్రమంలో 23 ద్విచక్ర వాహనాలు సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్థానికులతో డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ డి.స్వామిగౌడ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐదు రైస్ మిల్లులు సీజ్



మల్లికార్జున రైస్‌మిల్లును సీజ్ చేస్తున్న అధికారులు

మక్తల్: సీఎంఆర్ (కస్టమ్ మిలింగ్ రైస్) సరఫరా చేయకపోవడంతో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలోని తెలంగాణ, స్టార్, లిమ్రా రైస్ మిల్లులను సీజ్ చేశారు. ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన బియ్యం ఇవ్వాలంటూ యాజమానులకు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు సీజ్ చేశామని అధికారులు వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గురురాజారావు, డీటీ అనందం, ఆర్ఐ కాశప్ప, మక్తల్ పోలీసులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని రెండు రైస్ మిల్లులను సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఆనందం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఉమర్ రైస్‌మిల్లులో 7,0702 బస్తాల వడ్లు స్టాక్ ఉండాల్సి ఉండగా, ఐదువేల బస్తాలు మాత్రమే స్టాక్ ఉందని సీఎంఆర్ చేయడం కోసం ఒక బస్తా కూడా ఈ మిల్లులో లేదని తెలిపారు. మిల్లు యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం మిల్లును సీజ్ చేశామని పేర్కొన్నారు. అలాగే మల్లికార్జున రైస్‌మిల్లుకు సంబంధించిన 97,639 బస్తాల వడ్లు ఉండాల్సి ఉండగా 76వేల బస్తాలు మాత్రమే స్టాక్ ఉందని, 21,639 బస్తాలు తక్కువగా ఉందని, సీఎంఆర్ పెట్టడంలో కూడా మిల్లు యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. అందువల్లే ఈ మిల్లును సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. స్టాక్ కూడా మిల్లు దగ్గరలో ఉంచుకోవాల్సి ఉండగా, ప్రభుత్వ అనుమతులు లేకుండా పత్తి మిల్లులో ఉంచడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మల్లికార్జున మిల్లు యజమానులు కనీసం మిల్లుపేరు కూడా ఏర్పాటు చేసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రెండు మిల్లులను సీజ్ చేయడంతో పాటు మిల్లుల యజమానులపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులు గురురాజరావు, కాశప్ప తదితరులు ఉన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని బారుగూడెం పరిధి మహ్మదీయ కళాశాలలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్న బల్మూరి నరేష్(19) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా గుడిబండ శివారు కొండనాగుల గ్రామానికి చెందిన నరేష్ మహ్మదీయ కళాశాలలో బీఫార్మసీ చదువుతూ కళాశాల సమీప వాయుపుత్రనగర్‌లోని అద్దె గదిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఆయన కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తుండగా, ఆమె నిరాకరించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన నరేష్ స్టీల్ గ్రిల్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్నేహితులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

అడ్డాకుల: మూసాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 11 మంది పట్టుబడ్డారు. సోమవారం మహబూబ్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ముగ్గురికి రూ.2వేల చొప్పున జరిమానా, రెండు రోజుల జైలుశిక్ష, రెండోసారి పట్టుబడిన ఒకరికి 16 రోజుల జైలుశిక్షను విధించినట్లు తెలిపారు. నలుగురికి రూ.2వేల చొప్పున, ఒకరికి రూ.3500, ఒకరికి రూ.3వేలు, మరొకరికి రూ.2500 జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భూవివాదంలో ఇరువర్గాలపై కేసునమోదు

మహమ్మదాబాద్: ఉమ్మడి గండేడ్ మండలంలోని కప్లాపూర్ గ్రామంలో సోమవారం భూవివాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కప్లాపూర్‌నకు చెందిన అయ్యమల్ల గోపాల్‌గౌడ్ అదే గ్రామానికి చెందిన బిజ్జారం బాబుగౌడ్‌తో భూమిని కొనుగోలు చేశాడు. అట్టి భూమి కొలతల్లో తక్కువగా ఉండడం కారణంగా ఇరువురు కుటుంబీకుల మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో ఇరువురు మహమ్మదాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసులునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వేధిస్తున్నాడని యువకుడిపై..

మహమ్మదాబాద్: నంచర్ల గ్రామానికి చెందిన ఓయువతిని మద్దూర్ మండలంలోని నిడ్జింతకు చెందిన ఓ యువకుడు వేధిస్తున్నాడని బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. సదరు యువకుడు, యువతికి స్వయానా మేనమామ కొడుకు అని పలుమార్లు మందలించినా తీరుమార్చుకోలేదని అన్నారు. దీంతో యువతి విషయాన్ని తల్లికి చెప్పడంతో ఆమె ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

పచ్చిరొట్టతో భూమికి లాభాలు



పొలాల్లో సాగు చేసిన జనుము పంట

అలంపూర్: వరిసాగులో సేంద్రియ ఎరువులను తగు పాళ్లలో అందించడంలో రైతులు విఫలమవతున్నారు. దీంతో పంటల దిగుబడి తగ్గిపోతుంది. కొన్ని రోజుల్లో వరి సాగుకు రైతులు సిద్ధం కాబోతున్నారు. ఈ పరిస్థితుల్లో పచ్చి రొట్ట ఎరువుల సాగుతో మంచి ప్రయోజనాలు పొందవచ్చని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు.

భూసారం పెరుగుదల

పచ్చిరొట్ట వినియోగం వలన ముఖ్యంగా భూమి గుల్ల బారి, భూసారం బాగా పెరుగుతుంది. పొలానికి నీటిని, పోషక పదార్థాల నిల్వ ఉంచుకోనే శక్తి పెరుగుతుంది. మొక్కల వేర్లకు గాలి, నీరు పోషకాలు పుష్కలంగా అందుతాయి. జనుము, జీలుగలు, పెసర వంటి పచ్చి రొట్ట విత్తనాలను, ఎరువులను తక్కువ ఖర్చుతోనే పెంచుకోవచ్చు. వీటి ద్వారా భూములను మరింత సారవంతంగా చేసుకోవచ్చు. భూమిలో ఆమ్ల, క్షార గుణాలను పెంపొందించుకోవచ్చు. మొక్కలకు సూక్ష్మ పోషకాల లోపాలు రాకుండా చూసుకోవడంతోపాటు పంట నాణ్యత, దిగుబడులు మెరుగుపడేందుకు పచ్చి రొట్ట మేలు చేస్తుంది. వీటి వలన చీడపీడల బెడద తగ్గుతుంది. పంటలో కలుపు మొక్కలను నివారించుకోవచ్చు. వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలో ఇంకేలా చేస్తుంది. పంటలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మక్రిములు భూమిలో వృద్ధి చెందేందుకు దోహదపడుతుంది. పప్పు జాతి పచ్చిరొట్ట పైరు వలన భూమిలో నత్రజనిని స్థిరీకరించి భూసారం అభివృద్ధి చెందుతుంది.

ఎరువుల ఎంపిక

పచ్చిరొట్ట పైరు బాగా పెరిగి, ఆకులు ఎక్కువగా, కాండం వచ్చి మెత్తగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా వీలైనంత వరకు లెగ్గింగ్ జాతి మొక్కలను పెంచడం వలన వేర్లపైనే నత్రజని బుడిపెల ద్వారా గాలిలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. ఇవి త్వరగా కుళ్లిపోయే ప్రభావం కలిగి ఉంటాయి. ఇవి అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉండటంతో నీటి ఎద్దడిని తట్టుకుని పెరుగుతుంది. పచ్చిరొట్ట పైర్ల వేర్లు భూమిలోకి చొచ్చుకునిపోయే గుణం కలిగి ఉంటాయి. త్వరగా పెరిగి కలుపు మొక్కల పెరుగుదలను అరికట్టేందుకు ఉపయోగపడేలా చూసుకోవాలి.

జనుములు

ఎకరానికి 20 కిలోల విత్తనం కావాలి. పూత దశ కంటే పంట వేసిన 8 వారాల తర్వాత కోసినప్పుడు 6–8 టన్నుల పచ్చి రొట్ట వస్తుంది. టన్ను జనుములో నాలుగు కిలోల నత్రజని, కిలో భాస్వరం, 3 కిలోల పొటాష్ ఉంటుంది.

పిల్లి పెసర సాగుతో..

ఎకరానికి 6 నుంచి 8 కిలోల విత్తనం వేసుకోవాలి. పూత దశలో 4 నుంచి 5 టన్నుల పచ్చి రొట్ట ఇస్తుంది. దీనిని పరిశుభ్రంగా వాడుకోవచ్చు. టన్ను పిల్లి పెసరలో 4 కిలోల నత్రజనిని, కిలో భాస్వరం, 3 కిలోల పోటాష్ లభిస్తుంది. రైతులు పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు చల్లుకుని భూముల్లో సేంద్రియ కర్బనం పెంపొందించుకోవాలి.

జీలుగ సాగు

పచ్చిరొట్ట ఎరువుల సాగు చేసుకుంటే భూమికి అవసరమైన సేంద్రియ పదార్థాల్ని అందిస్తాయి. వీటి వలన భూమిలో సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెందుతాయి. జీలుగలు ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనం కావాలి. పూత దశలో కోసినపుడు ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఒక టన్ను జీలుగ సాగులో ఐదు కిలోల నత్రజని, 1.5 కిలోల భాస్వరం, 4 కిలోల పొటాష్ వస్తుంది. చౌడు భూములకు బాగా పని కొస్తుంది.

నేటి నుంచి శ్రీవారి పుష్కరిణి మూసివేత

తిరుమల: శ్రీవారి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు గాను మంగళవారం నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేస్తున్నారు. నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. పుష్కరిణి మరమ్మతుల కోసం మొదటి పది రోజుల పాటు నీటిని తొలగిస్తారు. ఆ తర్వాత పది రోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తి చేస్తారు. చివరి పది రోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలోని నీటి పీహెచ్ విలువ ఏడు ఉండేలా చూస్తారు. టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో టీటీడీ షవర్లు ఏర్పాటు చేసింది.

కొత్త న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

- బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్
- సీజేతో కలిపి 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న సీజే జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా జస్టిస్ కళాసికం సుజన, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఫస్ట్ కోర్టు హాల్లో ఉదయం 9.45 గంటలకు జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన సుజన, లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్‌లను అదనపు జడ్జీలుగా నియమిస్తూ రాష్ట్రపతి గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరి నియామకంతో హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. ఇంకా శాశ్వత, అదనపు న్యాయమూర్తులు కలిపి 12 ఖాళీలున్నాయి. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే కొత్త న్యాయమూర్తులు కేసుల విచారణలో పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

సోమవారం సాయంత్రం తెలంగాణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త న్యాయమూర్తులు జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్ కుమార్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులపై సర్కార్ నిర్లక్ష్యం

కిషన్‌రెడ్డి, ఈటల సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సంజీవరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో ప్రజలు నష్టపోయి అల్లాడుతుంటే వారిని ఆదుకోకుండా కేసీఆర్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 900 కోట్లకుపైగా ఉన్న జాతీయ విపత్తు నిధులతో బాధితులకు తాత్కాలిక సాయం కూడా అందించలేకపోయిందని ధ్వజమెత్తారు. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు సర్కార్ నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపించిందన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డితోపాటు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల, జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు సంజీవ్‌రావు (చెన్నూరు), అమరురాజుల శ్రీదేవి (బెల్లంపల్లి) ఆమె భర్త, బెల్లంపల్లి మాజీ మున్సిపాల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 అసెంబ్లీ సీట్లూ గెలుస్తామని, మరో 10 మంది సీనియర్ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని వెల్లడించారు.

సోయం వివరణ కోరతాం...

'ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు గిరిజన రిజర్వేషన్లపై చేసిన ప్రకటన ఆయన వ్యక్తిగతం. ఈ ప్రకటనతో పార్టీకి సంబంధం లేదు. దీనిపై ఆయన వివరణ తీసుకుంటాం. గిరిజన రిజర్వేషన్ల కోసం పోరాటంలో బీజేపీ ముందుంటుంది. అధికారంలోకి రాగానే లంబాడాలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుంది. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గిరిజనులకు అన్యాయం జరిగింది. జనాభా ప్రాతిపదికన ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

గుదిబండ..'అప్పు'డే!

టీడీపీ దిగిపోయే నాటికి రాష్ట్రంపై రుణ భారం రూ.2,64,451 కోట్లు

ఇప్పుడు నాలుగేళ్లలో రూ.1,77,991 కోట్లే

- పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలు మరోసారి వెలుగులోకి
- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఏపీ అప్పులు
- లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, అమరావతి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అప్పులపై టీడీపీతో పాటు దాని అనుబంధ ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో మరోసారి తేలిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన అప్పులు రూ.1,77,991 కోట్లు మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో స్పష్టం చేశారు. 2019 నాటికి ఏపీకి రూ.2,64,451 కోట్లు అప్పులుండగా 2023 మార్చి నాటికి రూ.4,42, 442 కోట్లకు చేరినట్లు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అసెస్ చేస్తోందా? 2019 మే నుంచి ఏపీ ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసింది? ఆర్థిక పరిస్థితిని అంచనా వేశారా?.." అంటూ నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధనల మేరకు వ్యవహ రిస్తోందని తేల్చి చెప్పారు. ద్రవ్యలోటు తగ్గింపు, వివేకంతో కూడిన రుణ నిర్వహణ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల్లో సుస్థిరత, పారదర్శకతను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్‌బీఎంను అసెంబ్లీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులకు లోబడే ఏపీ అప్పులు ఉన్నాయని వెల్లడించారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులను, ఆర్థిక పరిమితులను అమలు చేస్తున్నారా.. లేదా? అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన వ్యయ విభాగం పరిశీలన చేస్తూ ఉంటుందని వివరించారు.

కాకి లెక్కలతో పరిపాటిగా..

టీడీపీ దుష్ప్రచారానికి నిత్యం వంత పాడుతున్న ఎల్లో మీడియా అప్పులపై తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో మరోసారి తేటతెల్లమైంది. ఒకసారి రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశారని, మరోసారి రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ కాకి లెక్కలతో కథలు అల్లటం ఎల్లో మీడియాకు రివాజుగా మారింది. ఈ విష ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నా రహస్యంగా అప్పులను దాచారనే విధంగా ఎల్లో మీడియా అవాస్తవాలను వండి వారుస్తోంది. పరిమితులకు లోబడే అప్పులు తీసుకుంటున్నామని, టీడీపీ హయాంతో పోలిస్తే పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలు స్పష్టం చేసింది. తీసుకున్న అప్పులను సామాజిక హితం కోణంలోనే ఖర్చు చేస్తోంది. భారీగా సంక్షేమ పథకాలు, నగదు బదిలీతో పేదలకు లబ్ధి చేకూరుస్తోంది. కోవిడ్ సమయంలోనూ డీబీటీతో పేదలను ఆదుకోవడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించకుండా చర్యలు తీసుకుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఇవన్నీ ముమ్మాటికీ నిజమని రుజువైంది. ఈ గణాంకాలను ఆర్బీఐ నివేదిక ప్రకారం వెల్లడిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా పాఠకులకు తప్పుడు సమాచారాన్ని చేరవేయకుండా విశ్వసనీయతతో జర్నలిజం విలువలను పాటించాలని ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ఆ 3 పార్టీలూ ఒక్కటే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంల డీఎన్ఏ ఒక్కటే
- అందుకే ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నాయి
- కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదు
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం ఒక్కటే. ఈ మూడు కుటుంబ పార్టీలే. వాటి డీఎన్ఏ కూడా ఒకటే. అందుకే ఆ మూడు పార్టీలు యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి)ను వ్యతిరేకిస్తున్నాయి. ముస్లిం మహిళలకు హక్కులు వద్దంటున్నాయి..'అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఈ మూడు పార్టీలు ఒకే గూటి పక్షులు. గతంలో పొత్తు పెట్టుకున్నాయి. ఇందులో ఎవరికి ఓటేసినా బీఆర్‌ఎస్‌కు వేసినట్లే..'అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మహా ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగసభలో, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి ఉద్దేశపూర్వకంగా బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ఏ పార్టీతో కలవలేదని, భవిష్యత్తులో కూడా కలవబోదని చెప్పారు. ప్రజలను మోసం చేసిన చరిత్ర సీఎం కేసీఆర్‌దని, గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం ఖాయమని చెప్పారు.

ఇప్పటికీ వైఎస్ హయాంలోని రేషన్ కార్డులే..

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన రేషన్‌కార్డులే తప్ప.. తెలంగాణలో కొత్తవి రాలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డులివ్వాలనే సోయి కేసీఆర్ సర్కారుకు లేదని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి.. వెన్నుపోటు పొడిచారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు ఎరువులు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాల్లో నిప్పులు పోశారని, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని, దళితబంధు స్కీంను అమ్ముకుంటున్నారని, బీసీ బంధు పేరిట ఆ వర్గాలను మభ్యపెడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు.

బీఆర్‌ఎస్ ఆట కట్టించాలి..

దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో నాలుగు కోట్లకు పైగా ఇళ్లు కట్టించామని, తెలంగాణలోనూ ఇళ్లు కట్టించాలని కోరినా ఇక్కడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్లు లేవు కానీ.. ప్రజాధనం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ముఖ్యమంత్రి రాజభవనాన్ని కట్టుకున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా లిక్కర్ తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణను దోచుకుంటున్న బీఆర్‌ఎస్ ఆట కట్టించాల్సిన అవసరముందని అన్నారు.

నియంత పాలనను అంతమొందిస్తాం: డీకే అరుణ

తెలంగాణలో నియంతపాలన అంతమయ్యే దాకా బీజేపీ నిద్రపోదని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఈ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చే వరకూ వదలబోమని, కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వకుంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక తామే ఇస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లిచూపుల రోజే మృత్యు ఒడిలోకి..

- గ్రానైట్ బండలు మీద పడి యువకుడు మృతి


వాకిటి ఇంద్ర (ఫైల్)

గట్టు: తెల్లారితే పెళ్లి చూపులకు వెళ్లాల్సి ఉండగా.. గ్రానైట్ బండలు మీదపడి మండలానికి చెందిన యువకుడు మృత్యువాత పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తెలుగు వాకిటి దొడ్డెన్న కుమారుడు తెలుగు వాకిటి ఇంద్ర (21) మండల కేంద్రంలోని రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తుండేవాడు. ఆదివారం రాత్రి ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న గ్రానైట్ బండల లోడు డీసీఎంలో మండల కేంద్రానికి చేరుకుంది. రైస్ మిల్లు దగ్గర డీసీఎం నుంచి బండలను కిందకు దింపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బండలు యువకుడిపై పడడంతో తలకు వెనుకభాగంలో బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఆయనను గద్వాల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి ఫిర్యా దు మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. సోమ వారం రోజు మృతుడికి పెళ్లి చూపులకు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇలా తెల్లారకముందే మృత్యు రూపంలో బండలు కబళించి వేయడంతో ఆ కుటు ంబంలో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలు సుకున్న గద్వాల ఎమ్మె ల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జిల్లా ఆస్పత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని వ్యక్తం చేశారు.

జూరాల గేట్ల మూసివేత

- ప్రాజెక్టుకు 58 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో
- జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి


జూరాల ప్రాజెక్టు వద్ద మూసివేసిన క్రస్టు గేట్లు

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట/ రాజోళి/ మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో సోమవారం 11 క్రస్టు గేట్లను మూసివేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు 75,627 క్యూసెక్కులు ఉండగా.. ఉదయం 9 గంటలకు 90 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 11 క్రస్టు గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు సాయంత్రం 4 గంటలకు గేట్లను మూసివేశారు. రాత్రి 9 గంటల వరకు వరకు ప్రాజెక్టుకు 53 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో 12 యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగించారు. ఇందుకోసం 42,439 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 87 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 150 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 46,256 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.407 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ, దిగువ జలవిద్యుకేంద్రంల్లో 472 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టామని, ఇప్పటి వరకు 46 మిలియన్ యూనిట్లు సాధించినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్ కుమార్ తెలిపారు.

- ఎగువన ఉన్న ఆలమట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 1,36,986 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 60,031క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 48,825 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 52,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.
- శ్రీశైలం జలాశయంలో సోమవారం 850.1అడుగుల నీటిమట్టం, నీటి నిల్వ 80.3568 టీఎంసీలుగా ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగులు, నీటి నిల్వ 215.8070 టీఎంసీలు. కాగా జూరాల నుంచి విద్యుదుత్పత్తి ద్వారా 42,439 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

సుంకేసులకు స్వల్ప ఇన్‌ఫ్లో..

రాజోళి మండలంలోని సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి సోమవారం స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితోపాటు స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల 440 క్యూసెక్కులు వచ్చినట్లు జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 1.026 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్ కాల్వకు 950 క్యూసెక్కులు..

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుంది. సోమవారం జూరాల ఎడమ కాల్వ ద్వారా 640, సమాంతర కాల్వ ద్వారా 753 క్యూసెక్కులు వదలడంతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కులు, భీమా-2 ద్వారా 655 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలారు. అలాగే ఊకచెట్టు పెద్ద, చిన్న వాగుల నుంచి వరద వస్తుండటంతో ప్రాజెక్టు ఒక గేటు ద్వారా 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.


రామన్‌పాడులోని భీమా కాల్వ ద్వారా విడుదలవుతున్న నీరు

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- ఎన్ఆర్ఈజీఎస్ బిల్లుల చెల్లింపుకోసం రూ.20 వేలు డిమాండ్
- రూ.9 వేలకు కుదిరిన ఒప్పందం.. ఏసీబీని ఆశ్రయించిన బాధితురాలు
- నంచర్ల పంచాయతీ కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు


ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

మహమ్మదాబాద్: ఎన్ఆర్ఈజీఎస్ పనుల బిల్లుల చెల్లింపులకు గాను లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని నంచర్లలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. నంచర్లలో సేవకుల సువర్ణ ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. 4.41లక్షల రూపాయలతో 2022లో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.4.41 లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ సేవకుల సువర్ణ చేపట్టింది. ఈ మేరకు ఏఈ, ఈఈలు ఎంబీ రికార్డు చేసి దీనికి సంబంధించి జూన్ 1, 2023లో రూ.4 లక్షల చెక్, జూన్ 8న రూ.41,320 చెక్‌ను పంచాయతీ కార్యదర్శి పాండురంగయ్యకు ఇచ్చారు. అయితే పంచాయతీ కార్యదర్శి తనకు రూ.20 వేలు ఇవ్వాలని కాంట్రాక్టర్ సువర్ణను కోరగా.. 2 శాతం చొప్పున రూ.9 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి పలుమార్లు డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఆమె ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం నంచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూ.9 వేలు పంచాయతీ కార్యదర్శికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని పూర్తి విచారణ అనంతరం నాంపల్లి స్పెషల్ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సీఐలు లింగస్వామి, జిలాని తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శి పాండురంగయ్య

సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా నల్లమల


నల్లమలలో సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వలబాలరాజు

మన్ననూర్: నల్లమలలోని వివిధ ప్రాంతాలను మరింత సౌందర్యవంతంగా తయారు చేసి సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు తెలిపారు. సోమవారం సినీ నిర్మాత రవిబాబు నిర్మిస్తున్న కొత్త సినిమాకు ప్రభుత్వ విప్ కెమెరా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా సినిమా షూటింగ్‌లు చేసుకునేందుకు ఇక్కడ ఎన్నో ప్రదేశాలు అనువుగా ఉన్నాయని తెలిపారు. కొండలు, కోనలు, జలపాతాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలతో పాటు పచ్చిక మైదానాలు, అడవులు అనేకం ఉన్నాయని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో అచ్చంపేట నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో ఎక్కువ సినిమాలు తీసేందుకు సినీ పరిశ్రమకు మా వంతు సహకారం అందజేస్తామని పేర్కొన్నారు.

ఏకకాలంలో రుణ మాఫీ, ఉద్యోగాల భర్తీ


మిడ్జిల్ మండలం సింగందొడ్డిలో పాదయాత్ర చేస్తున్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ప్రజాహిత పాదయాత్రలో భాగంగా సోమవారం మండలంలోని కొండేడులో ఆయన ప్రసంగించారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల దుందుబీ వాగులో మునిగి మృత్యువాత పడిన ఇద్దరు యువతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రాణాలు కోల్పోయి శోకసంద్రంలో ఉన్న కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వచ్చి కనీసం పరామర్శించకపోవడం విచారకరమని అన్నారు.

తండాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ రావాలి..

మిడ్జిల్: తండాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ప్రజాహిత పాదయాత్ర సోమవారం సింగందొడ్డి వద్ద మండలానికి చేరుకుంది. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. అనంతరం పాదయాత్ర సింగందొడ్డి, లాక్యాతండా, తుల్జనాయక్ తండా, గోల్లోని కుంటతండా, రాయినోనికుంటతండా, చౌటకుంట తండాల మీదుగా దోనూర్ చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కిందని అన్నారు. 9ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మండలంలో ఏఒక్క గ్రామంలోనైన ఎమ్మెల్యే ఇళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని ప్రతి గిరిజన తండాకు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. గోల్లోని కుంట తండాలో ఉపసర్పంచ్ దాస్రునాయక్‌తో పాటులో దాదాపు 30 మంది కాంగ్రెస్‌లో చేరారు. పాదయాత్రలో టీపీసీసీ కార్యదర్శి రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, సంపత్‌కుమార్, ఎంపీటీసీలు గౌస్, నర్సింహ, రాజారెడ్డి, సర్పంచ్‌లు జంగయ్య, వేముల జంగయ్య నాయకులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో పదేళ్ల జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మూగ అమ్మాయిపై లైంగికదాడి చేసిన ఘటనలో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. రాజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోచమ్మ గడ్డతండాకు చెందిన ఓ మూగ అమ్మాయిని 2018 సెప్టెంబర్ 17న అదే తండాకు చెందిన బి.శంకర్ అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు సోమవారం కోర్టుకు రావడంతో నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి విచారణ జరిపించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ 11 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. వాదనలు, ప్రతివాదనాలను న్యాయమూర్తి విన్న తర్వాత బి.శంకర్‌కు పదేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.5 వేల జరిమానతో పాటు బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం. జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీలోని ఎస్ఎస్ నగర్ అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్ ఉన్న నీటి సంపులో పడి ఆదివారం సాయంత్రం 5.30ప్రాంతంలో ఆకాష్(7) మృతి చెందాడు. మృతుడు మూగవాడు కావడంతో సంపులో పడిన సమయంలో ఎవరూ గమనించలేకపోయారు. మృతుడి తండ్రి బాలకిష్టయ్య కొన్ని రోజుల నుంచి అదే అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అయితే అపార్ట్‌మెంట్‌లో ఉన్న సంపును మూసివేయాలని గతంలో బాలకిష్టయ్య యాజమానుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని.. వారిపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.